## ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

### జంగంగుట్ట డంపింగ్ యార్డ్‌లో ప్లాస్టిక్ దహనం

**విశ్వంభర, చేవెళ్ల :** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని జంగంగుట్ట డంపింగ్ యార్డ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను కాల్చడం వల్ల పరిసర ప్రాంతాల్లో తీవ్ర కాలుష్యం వ్యాపిస్తోంది. ప్లాస్టిక్ దహనం సమయంలో విడుదలయ్యే విషవాయువులు గాలిలో కలసి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డ్‌లో చెలరేగుతున్న మంటలు కొన్నిసార్లు అదుపుతప్పి సమీప వ్యవసాయ పొలాలకు వ్యాపిస్తున్నాయని రైతులు వాపోతున్నారు. దీనివల్ల పంటలు దెబ్బతినడంతో పాటు ఆర్థిక నష్టాలు వాటిల్లుతున్నాయని వారు చెబుతున్నారు. ఈ విషయం పై భారతీయ జనతా పార్టీ జిల్లా యువనాయకుడు డాక్టర్ వైభవ్ రెడ్డి స్పందిస్తూ, ప్లాస్టిక్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. డంపింగ్ యార్డ్‌లో అగ్ని ప్రమాదాలు నివారించేందుకు పర్యవేక్షణ బలోపేతం చేయడం, భద్రతా సిబ్బందిని నియమించడం, ప్రత్యామ్నాయ వ్యర్థ నిర్వహణ విధానాలను అమలు చేయాలని అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**విశ్వంభర, మహబూబాబాద్ :** మహబూబాబాద్ మండలం పర్వతగిరి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల, కురవి మండలం నేరేడ జడ్.పి.హెచ్.ఎస్ లను బుధవారం జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిల్లలకు అందిస్తున్న విద్య బోధనలను స్వయంగా పరిశీలించారు, నూతన టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డిజిటల్ తరగతుల ద్వారా విద్యా బోధనలు అందించాలని , రానున్న పదవ తరగతి పరీక్షల్లో అన్ని విద్యాసంస్థలలో ఉత్తమ ఫలితాలు సాధించడం కోసం ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించి విద్యార్థుల ప్రతిభను వెలికి తీయాలని సూచించారు. పిల్లలు, ఉపాధ్యాయుల హాజరు శాతం పక్కాగా ఉండే విధంగా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. హెల్త్, ఎడ్యుకేషన్, న్యూట్రిషన్ లపై పిల్లలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని చెప్పారు. అంతకుముందు పాఠశాల ఆవరణంలోని కిచెన్ షెడ్, డైనింగ్ హాల్, మరుగుదొడ్లు, తరగతి గదులు పరిశీలించారు. భోజనం సిద్ధం చేసే సిబ్బంది తగిన జాగ్రత్తలు వహిస్తూ ఉండాలని, విద్యార్థిని, విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని తెలిపారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటన సమయంలో అన్ని సంక్షేమ వసతి గృహాలు, విద్యాసంస్థలను తనిఖీలు నిర్వహించాలని సూచించారు.

## రాష్ట్ర స్థాయికి పోటీలకు ఇనుగుర్తి విద్యార్థులు

**విశ్వంభర, ఇనుగుర్తి :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సీఎం కప్ క్రీడా పోటీలలో మహబూబాబాద్ జిల్లా ఇనుకుర్తి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ స్టూడెంట్స్ సత్తా చాటారు. జిల్లా స్థాయి పోటీలలో అసాధారణ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఆరుగురు ఎంపికయ్యారు.వాలీబాల్ క్రీడలో చిదిరాల వివేక్ అద్భుతమైన ప్రతిభ కనబరచి స్టేట్ లెవల్ కు సెలెక్టయ్యాడు. సాఫ్ట్ బాల్ పోటీలో గర్ల్స్ విభాగం నంగునూరు భార్గవి,బి. నిహారిక, బొల్లు సహస్ర, బాలుర విభాగంలో జాటోతు అజయ్, గుగులోతు రాము ఉత్తమ క్రీడా ప్రతిభను కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఇనుగుర్తి మండలం నుంచి ఆరుగురు సెలెక్ట్ కావడం పట్ల మండలంలో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఎంపీడీవో బండారు పార్థసారథి, ఎంఈఓ జంగారూపారాణి సంబంధిత క్రీడాకారులను అభినందిస్తూ రాష్ట్రస్థాయిలో సైతం రాణించాలని ఆకాంక్షించారు. సీఎం క్రీడా పోటీలలో అసాధారణ ప్రతిభ కనపరచడానికి కారణమైన ఇనుగుర్తి జడ్పీహెచ్ఎస్ ఫిజికల్ డైరెక్టర్ తాళ్ల ప్రణయ్ ను ప్రశంసించారు. నిరంతరం క్రీడాకారులను పలు ఆటలలో ప్రేరేపిస్తూ,శిక్షణ ఇస్తూ,ప్రోత్సహిస్తూ , సూచనలిస్తూ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నప్రణయ్ కృషి అభినందనీయమని కితాబిచ్చారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

**విశ్వంభర, అనంతగిరి :** అనంతగిరి మండల పరిధిలోని వాయిలసింగవరం గ్రామంలో బుధవారం గ్రామ పంచాయితీ కార్యాలయం దగ్గర సిరి పౌండేషన్ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను రైతులకు వివరించారు. అనంతరం సిరి ఫౌండేషన్ సంస్థ వ్యవస్థాపకులు కిసాన్ సేవారత్న డాక్టర్ మొలుగూరి గోపయ్య మాట్లాడుతూ, భవిష్యత్ తరాలు ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం చేయాలన్నారు. గత 60 సంవత్సరాలుగా చేస్తున్న రసాయన వ్యవసాయంతో భూసారం దెబ్బతిన్నదని అన్నారు నేల ఆరోగ్యమే పంట ఆరోగ్యం , పంట ఆరోగ్యమే మన ఆరోగ్యమన్నారు. సహజ సిద్ధ పద్ధతులతో భూసారం పెంచడం చీడపీడల నివారణపై ఎలాంటి పెట్టుబడులు లేకుండా పలు పద్ధతులను రైతులకు వివరించారు . ఈ కార్యక్రమంలో రైతులు కొల్లు సుబ్బారావు, రేవూరి పెద వెంకటేశ్వర్లు, తెలగపల్లి సైదులు, దేవులపల్లి నరసింహరావు, రేవూరి రాంబాబు, చిప్పల రాంబాబు, పగిడి వెంకటేశ్వర్లు, అల్లు రమేష్, బొర్ర వెంకటయ్య, అక్కినపల్లి వెంకటేశ్వర్లు, గద్దె వెంకటేశ్వర్లు, కంటు చినవీరయ్య, జగన్నాధం, పుల్లప్ప,చిప్పల వెంకటయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# కంటోన్మెంట్‌లో ఎన్నికలు నిర్వహించాలి

**ఎంపీ ఈటల రాజేందర్**

**విశ్వంభర, హైదరాబాద్ :** సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో తక్షణ ఎన్నికలు నిర్వహించాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కంటోన్మెంట్ బోర్డు సభ్యులుగా బానుక నర్మదా మల్లికార్జున్ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సికింద్రాబాద్ కంటోన్మెంట్ ప్రాంతంలో తక్షణమే ఎన్నికలు నిర్వహించి, పాలక మండలి ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వారి సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించాలంటే ప్రజాప్రతినిధులు ఉండాలని అన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని కంటోన్మెంట్లలో ఎన్నికలు పెండింగ్ లో ఉన్నాయని , కేవలం సికింద్రాబాద్ లో మాత్రమే కాకుండా వివిధ రాష్ట్రాల్లో కంటోన్మెంట్ ప్రాంతాల అభివృద్ధి, పరిపాలనలో పారదర్శకత కోసం ఎన్నికలు జరగాలని డిమాండ్లు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో ఇటీవల రెండోసారి పదవీకాల విస్తరణ పొందిన భానుక నర్మదా మల్లికార్జున్ కి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజల మధ్యలో ఉండి సమస్యలను పరిష్కరించేందుకు ఆమె చేస్తున్న కృషి అభినందనీయమని చెప్పారు. అయితే నామినేటెడ్ సభ్యులతో కాకుండా ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రతినిధుల ద్వారానే అన్ని వార్డుల ప్రజల సమస్యలు సమర్థవంతంగా పరిష్కారం అవుతాయని అన్నారు. కంటోన్మెంట్ అంటే కేవలం మిలటరీ ప్రాంతమనే భావన తప్పని, కంటోన్మెంట్ ప్రాంతంలో నివసిస్తున్న ప్రజలకు ఇతర పట్టణ ప్రాంతాల ప్రజలకు ఉన్న హక్కులు, సదుపాయాలు సమానంగా ఉండాలని చెప్పారు. రోడ్లు, మౌలిక సదుపాయాలు, పాత ఇండ్ల సమస్యలు వంటి అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. ప్రజాప్రతినిధుల సలహాలు లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటే ప్రజాస్వామ్యంలో అది ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. కంటోన్మెంట్‌లోని అన్ని డివిజన్లలో అన్ని వర్గాల ప్రజల సమస్యలపై సమగ్ర చర్చ జరగాలని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కరించేందుకు బీజేపీ కట్టుబడి ఉందని తెలిపారు. అధికారులు ఈ రోజు ఉంటారు, రేపు వెళ్తారు కానీ మేము ఇక్కడే ఉంటామని అన్నారు. కంటోన్మెంట్ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను పరిష్కరించేందుకు మా వంతు కృషి చేస్తామని చెప్పారు.

# ఇక సిటీ బస్సుల్లోనూ లగేజ్ ర్యాక్స్

- ప్రయోగాత్మకంగా 150 బస్సుల్లో ఏర్పాటు
- త్వరలో మిగతా వాటిల్లో నూ ఏర్పాటు

**విశ్వంభర, హైదరాబాద్:** దూరప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు బస్సెక్కగానే తమవెంట తెచ్చుకున్న లగేజీ ని బస్సులో తమ సీట్ల పైభాగంలో ఉండే ర్యాక్స్ పైన పెట్టడం చూస్తుంటాం, దీంతో తమ వెంట తెచ్చుకున్న లగేజీ బరువు మోసే అవసరం వారికి ఉండదు. అయితే గ్రేటర్ పరిధిలో నడిచే సిటీ బస్సుల్లో ఆ సౌకర్యం లేదు. దీంతో ప్రయాణికులు తమ వెంట తెచ్చుకున్న బ్యాగుల బరువు మోస్తూ నిలబడాల్సిందే. ఈ విషయంలో విద్యార్థులు అధిక ఇబ్బందులకు గురవుతున్నారు. పలువురు ప్రయాణికులు లగేజీ సమస్య కు పరిష్కారం చూపాలని ఆర్టీసీ యాజమాన్యం దృష్టికి తెచ్చారు. అయితే అన్ని వేళల్లో బస్సుల్లో ఉండే రద్దీ నేపథ్యంలో ఈ సమస్య పరిష్కారానికి అవకాశం దొరకలేదు. అయితే ఇప్పుడు ఈ అంశంపై సీరియస్ గా దృష్టి సారించిన ఆర్టీసీ గ్రేటర్ పరిధిలో తిరిగే సిటీ బస్సుల్లో కూడా ప్రయాణికులు తమ వెంట తెచ్చుకున్న లగేజీని పెట్టుకునేందుకు ర్యాక్ లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. సిటీ బస్సుల్లో ప్రయోగాత్మకంగా లగేజీ అటకలు ఏర్పాటు చేయాలని ఆర్టీసీ నిర్ణయించింది. తొలుత రెండు బస్సుల్లో ఏర్పాటు చేసి పరిశీలించింది. ప్రయాణికుల అభిప్రాయ సేకరణ కోసం మొదటి విడతగా ప్రయోగాత్మకంగా 150 బస్సుల్లో ఏర్పాటు చేయనున్నారు. జిల్లా సర్వీసుల్లో ఉండేంత విశాలంగా కాకుండా, తక్కువ ఎత్తుతో ఉండేలా వాటిని ఏర్పాటు చేయనున్నారు.

కాగా తెలంగాణ ఆర్టీసీకి ప్రత్యేకంగా మియాపూర్లో బస్ బాడీ నిర్మాణ యూనిట్ ఉండడంతో ఈ ర్యాక్ ల ఏర్పాటు బాధ్యత మియపూర్ బస్ బాడీ యూనిట్ కే అప్పగించారు. ఇందుకు ఒక్కో బస్సును రూ. 15 వేల ఖర్చు అవుతుందని అధికారులు చెప్తున్నారు. ప్రస్తుతం 150 బస్సుల్లో ర్యాక్ ల ఏర్పాటు చేసే పని జరుగుతోంది. మరికొద్ది రోజుల్లో ఆ బస్సులు అటకలతో రోడ్డు ఎక్కనున్నాయి. అయితే ర్యాక్ లు ప్రయాణికులకు ఉపయోగకరమైన విధంగా ఉన్నాయా, సిటీ బస్సుల రద్దీ నేపథ్యంలో ప్రయాణికులు వాటిని వినియోగించుకుంటారా అనేది స్టడీ చేసి హైదరాబాద్ పరిధిలో తిరిగే మిగతా సిటీ బస్సుల్లో వాటి ఏర్పాటుపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రయాణికుల ఇబ్బందిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ యాజమాన్యం తీసుకున్న తాజా నిర్ణయం ఎంతో ఉపయోగకరమైంది. తక్కువ ఖర్చు తో కూడుకున్నది కావటంతో దీనికి సానుకూలత ఉంటుందని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మున్సిపల్ పాలకవర్గం పనిచేయాలి

### సదాశివపేట మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి

**విశ్వంభర, సదాశివపేట :** సదాశివపేట మున్సిపల్ చైర్మన్ గా మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరుల బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి టీజీ ఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్ లను ఈ సందర్భంగా నిర్మల జగ్గారెడ్డి సన్మానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం లో మున్సిపల్ పాలక వర్గం ఎల్లప్పుడూ ముందుడాలని సూచించారు. అభివృద్ధి నిధులను సక్రమంగా వినియోగిస్తూ పట్టణాభివృద్ధి కి పాటుపడాలన్నరు. ఈ కార్యక్రమం లో సిడిసి చైర్మెన్ రామ్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సత్యనారాయణ, చిరు, అరుణ్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

**అభివృద్ధి కార్యక్రమంలో పాల్గొన్న నిర్మల జగ్గారెడ్డి..**

సదాశివపేట మండలం మద్దికుంట, ఏటి గడ్డ సంఘం, తంగెడుపల్లి గ్రామాలలో బుధవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి పర్యటించారు. ఏటి గడ్డ సంఘం గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం లో పాల్గొన్నారు. అనంతరం మద్ది కుంట గ్రామం లో ఇందిరమ్మ ఇళ్ళ గృహ ప్రవేశాల తో పాటు గ్రామంలోని నూతనంగా నిర్మించబోయే స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి ఆమె భూమి పూజ నిర్వహించారు. అదేవిధంగా తంగేడుపల్లి గ్రామం లో సైతం స్కూల్ కాంపౌండ్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక సర్పంచ్ లు, నాయకులు పాల్గొన్నారు.

## ఐఎన్టియుసి చీఫ్ వైస్ పెసిడెంట్ మొగుళ్ళ రాజి రెడ్డి నియామకం

**విశ్వంభర, హైదరాబాద్ :** కార్మిక సంఘాలు కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోళ్లను రద్దు చేయాలని కార్మికుల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం మరింత ఉధృతమైన పోరాటాలు నిర్వహించాలని ఐ ఎన్ టి యు సి జాతీయ అధ్యక్షులు జి. సంజీవరెడ్డి పిలుపునిచ్చారు. ఐ ఎన్ టి యు సి రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ గా మొగుళ్ళ రాజిరెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లోని ఐ ఎన్ టి యు సి రాష్ట్ర కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో రాజి రెడ్డికి నియామక పత్రాన్ని సంజీవ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఐ ఎన్ టి యు సి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు పూడిగం చేస్తూ కార్మికుల ప్రయోజనాలను దెబ్బతీస్తుందని, శ్రమశక్తిని నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. బిజెపి పాలనలో దేశంలో కార్మికులకు, కర్షకులకు గడ్డుకాలం ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాటాలు నిర్వహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కార్మికుల హక్కుల కోసం మొగుళ్ల రాజిరెడ్డి నిరంతరం శ్రమిస్తున్నారని, జలమండలిలో ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వంతో సమన్వయం చేస్తూ తన శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని సంజీవరెడ్డి అభినందించారు. ఐ ఎన్ టి యు సి రాష్ట్ర చీఫ్ వైస్ ప్రెసిడెంట్ గా నియమితులైన మొగుళ్ళ రాజిరెడ్డి మాట్లాడుతూ ఐ ఎన్ టి యు సి అధినాయకత్వం తనపై విశ్వాసంతో ఇచ్చిన బాధ్యతలను అంకితభావంతో నిర్వర్తిస్తానని, యూనియన్ మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని ప్రకటించారు. ఇప్పటికే జలమండలిలో ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వ సహకారంతో దాదాపు పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. ఐ ఎన్ టి సి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు మొగుళ్ల రాజిరెడ్డి పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి జాతీయ రాష్ట్ర నాయకులు క్రియాశీల కార్యకర్తలు పాల్గొన్నారు.

## రేవంత్ ఫెయిల్..

### బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** మున్సిపల్ శాఖ మంత్రిగా సీఎం ఫెయిల్ అయ్యారని అసెంబ్లీ బీఆర్ఎస్ విప్ కేపీ వివేకానంద అన్నారు. బుధవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. స్వయంగా సీఎం రోడ్ల పైకి వస్తానని అంటున్నారని.. కానీ, ప్రజలకు ఏం అవసరమో గుర్తించడంలో ఘోరంగా విఫలం అయ్యారని పేర్కొన్నారు. తనే రాజు తనే మంత్రి అని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి ప్రజల అవసరాలు తీర్చడంలో రాజుగా, మంత్రిగా ఎందుకు సక్సెస్ కాలేకపోయారని ప్రశ్నించారు. రెండేళ్ల పాలనలో హైదరాబాద్ నగరంలో ఒక్కపని కూడా చేయలేదని ఆరోపించారు. సెకండ్ ఫేజ్ మెట్రో విస్తరణలో భాగంగా అడుగు ముందుకు పడడం లేదని.. నార్త్ హైదరాబాద్‌కు మెట్రో డిమాండ్ ఉన్నా దానిపై చర్చ చేయడం లేదని పేర్కొన్నారు. మూసీ సుందరీకరణ పేరుతో హడావుడి చేసిన రేవంత్‌రెడ్డి, ఇప్పుడు ఏం మాట్లాడడం లేదన్నారు. అసలు మహానగరంపై అవగాహన ఉన్న మంత్రి కేబినెట్‌లో లేకుండాపోయారని తెలిపారు. ఎస్ఆర్‌డీపీ పనులపై సీఎంకు అవగాహన లేదన్నారు. జీహెచ్ఎంసీ విస్తరణ పచ్చి మోసమని.. పూర్తిగా అశాస్త్రీయ పద్ధతిలో మూడు ముక్కలు చేశారని పేర్కొన్నారు. ప్రజల అవసరాల కంటే ఆదాయం పైనే మక్కువ చూపిస్తున్నారని అన్నారు. జీహెచ్ఎంసీలో ఎన్నికలు ఎప్పుడు పెట్టినా కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష

**విశ్వంభర, వలిగొండ :** యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో "ఇందిరమ్మ ఇండ్లు" నిర్మాణ కార్యక్రమంపై సీఈఓ శోభారాణి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇండ్ల నిర్మాణ పురోగతి, గ్రౌండ్ లెవెల్‌లో అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. సీఈఓ మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణం నిర్ణీత గడువులో పూర్తి చేయాలని, అర్హులైన లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రూ.5 లక్షల కు మించి నిర్మాణం చేయకూడదని, బయట అప్పులు తీసుకొని నిర్మాణం చేయొద్దు అని అన్నారు. భూసంబంధిత, సాంకేతిక మరియు పరిపాలనా సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న ఇండ్ల నిర్మాణ కార్యక్రమం విజయవంతంగా అమలు చేయడానికి అధికారులు కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. పనుల పూర్తి కోసం అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అధికారులకు అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.జలెందర్ రెడ్డి, మండల పంచాయతీ అధికారి సయ్యద అర్జుమాన్ బాను , పీఆర్ ఏఈ సందీప్ రెడ్డి, ఆర్. డబ్లు.ఎస్ ఏఈ రమ్య , ఏపీఓ పరశురాములు, బి.పి. విక్రమ్ మరియు మండలంలోని పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి అవగాహన సదస్సు

**విశ్వంభర, హైదరాబాద్ :** ఛత్రపతి శివాజీ మహారాజ్ 396 వ జయంతి సందర్భంగా రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు విముక్త చిరుతల పార్టీ తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబాల అనిల్ కుమార్ అన్నారు. అంశం:"తెలంగాణ వనరుల పరిరక్షణ" . ఈ సదస్సు మధ్యాహ్నం 2గం.లకు హైదరాబాద్లోని ఎస్వీకేలోని షోయాబుల్లాఖాన్ హాల్లో నిర్వహిస్తున్న ట్లు తెలిపారు. ఈసదస్సుకు తెలంగాణ రాష్ట్రంలో ఉన్న విద్యార్థులు, యువతీయువకులు, నిరుద్యోగులకు, మేధావులకు, సింగర్లకు, రచయిత కవులకు పేరుపేరునా ప్రతి ఒక్కరికి ఆహ్వానం అందిస్తున్నామన్నారు.

## రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచాలి

**విశ్వంభర, రామన్నపేట :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలంలో రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉంచి, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ద్వారా పారదర్శకంగా అందించాలని, రైతులను అయోమయానికి గురిచేసే ఫెర్టిలైజర్ యూరియా యాప్ ను ఎత్తివేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఎం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని స్థానిక తహసిల్దార్ లాల్ బహదూర్, మండల వ్యవసాయ అధికారి ఏజాజ్ అలీఖాన్ లకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం యూరియా విక్రయాన్ని యాప్ లో పెట్టడంతో డీలర్లు వారి దగ్గరి వారికే విక్రయిస్తుండడంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బంది పడుతున్నారన్నారు. మండలంలో సుమారుగా 15 వేల యూరియా బస్తాలు అవసరం పడతాయని, కలుపు తీసే వ్యవధి కూడా అయిపోతుందని, ఇంకా పది రోజులు దాటితే యూరియాతో కూడా అవసరం ఉండదని అన్నారు. వెంటనే అధికారులు చొరవ తీసుకొని సమస్యను పరిష్కరించాలని, సింగిల్ విండోలో రైతులకు యూరియా అందుబాటులో ఉంచి పారదర్శకంగా పంపిణీ చేయాలని అన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి, మండల వ్యవసాయ అధికారులతో ఫోన్లో మాట్లాడి సమస్యను వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, రైతు సంఘం మండల కార్యదర్శి బోయిని ఆనంద్, మండల కార్యవర్గ సభ్యులు కల్లూరి నాగేష్, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, భావండ్లపల్లి బాలరాజు, శానకొండ రామచంద్రం, పల్లె సత్యం, వేముల మల్లేశం, కన్నెబోయిన రాజా లింగం, తాటిపాముల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ ప్రభుత్వం కొత్త అక్రిడిటేషన్ కార్డుల ను జారీ చేయనున్న విషయం తెలిసిందే. జీవో నెం.252 ప్రకారం ఈ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియాతో పాటు ఫ్రీలాన్స్, వెటరన్ జర్నలిస్టులు అక్రిడిటేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. అర్హులైన జర్నలిస్టులు http://ipr.telangana.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈనెల 9 నుంచే దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, అక్రిడిటేషన్ల దరఖాస్తు, కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. దరఖాస్తు చేసుకునే సమయంలో జర్నలిస్టులకు ఏవైనా సాంకేతిక ఇబ్బందులు ఎదురైతే, వాటి పరిష్కారం కోసం మీడియా రిలేషన్స్ విభాగాన్ని సంప్రదించవచ్చని తెలిపారు. సందేహాల కొరకు హెల్ప్ లైన్ నంబర్ 9154170881ను ఏర్పాటు చేశామని తెలిపారు. ఆ హెల్ప్‌లైన్ కార్యాలయం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పని చేస్తుందని సమాచార పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సీహెచ్ ప్రియాంక వెల్లడించారు.